

# లిటిల్ రాస్కెల్

మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

7

**దశరథరామయ్య** ఉద్యోగంలో రిటైరై నాలుగేళ్ళు దాటింది. ఉద్యోగంలో వుండగా లేని కొత్త సమస్య ఈ నాలుగేళ్ళుగా ఆయన ఎదుర్కొంటున్నాడు.

ఆయనకి ఊహ తెలిసినప్పటినించి రిటైరయ్యేదాకా ఏదో వ్యాపకం వుంటూనే వుంది. చిన్నప్పుడు చదువు, చదువయ్యాక ఉద్యోగం, శెలవల్లో ఏదో ఓ పని వుండేది.

రిటైరయినప్పటినుంచీ పొద్దు ఎలా పోతుందా అనేచింతే. కొడుకు సాంబశివరావు ఉదయం తొమ్మిదిన్నరకి బేంక్‌కి వెళితే మళ్ళీ రాత్రికి గానీ తిరిగిరాడు. కోడలున్నా ఆమె ఇంట్లో వుండదు స్టూడెంటు కాబట్టి.

పేకాట, క్లబ్‌లకి వెళ్ళటంలాంటి అలవాట్లు ఆయనకి మొదటినుంచీ లేవు. తోటపని చేసుకుందామంటే, వాళ్ళు అద్దెకుండే ఇంట్లోని ప్రతిచదరపు అంగుళంలో ఇల్లుకట్టేశారు. మున్సిపల్ కార్పొరేషన్ రూల్స్ ప్రకారం వదిలిన స్థలంలో నాపరాళ్ళు పరిచారు. పార్ట్‌టైం ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ఒకటి రెండు ఆఫర్స్ వచ్చినా జీతం మరీ తక్కువ అవడంతో వద్దనుకున్నాడు.

కొత్తలో పాత స్నేహితులిళ్ళకి వెళ్ళేవాడు. ఇప్పుడు అదీలేదు. లైబ్రరీలో సభ్యుడిగా చేరాడు. రోజుకి రెండుమూడు గంటలు మించి చదివితే విసుగుపుడుతోంది. ఆవిడ బ్రతికివుంటే కబుర్లు చెప్పుకోడానికయినా తోడు వుండేది అని చాలాసార్లు అనిపించింది దశరథరామయ్యకి. కనీసం తను ఆరోగ్యంగా వుండబట్టి సరిపోయింది. అదే ఏ రోగంతోనో అడ్డం పడివుంటే ఇంకా ఘోరంగా వుండేది అని తృప్తిపడుతుంటాడాయన.

ఆ రోజు గురువారం కాబట్టి వంటపని కూడా లేదు. ప్రతి గురువారం భోజనం చేయడాయన. రాత్రుళ్ళు మాత్రం తిని పడుకుంటాడు.

కాలింగ్‌బెల్ చప్పుడయింది. తలుపు తెరిచాడు. ఎదురుగా పక్కింటి పాప పారిపోతూ కనిపించింది. "పట్టుకుంటే మాత్రం ముక్కు కోసేస్తాను జాగ్రత్త" అరిచాడు దశరథరామయ్య మనసులోనే నవ్వుకుంటూ.

కాలింగ్‌బెల్ నొక్కి తలుపు తీస్తుంటే పారిపోవడం ఆ పాపకి ఆట. తలుపు మూసి మళ్ళీ పడక్కుర్చీలో పడుకుని చదివిన దినపత్రికని ఇంకోసారి చదవసాగాడు.

కాసేపాగి కాలింగ్‌బెల్ మోగింది. అప్పటికే అయిదారుసార్లు లేచి తలుపు తెరిచాడు ఆయన. ఇక లేచే ఓపికలేక లేవలేదు ఆయన. చుట్ట తాగుతూ స్పోర్ట్స్‌కాలం చదవసాగాడు. నాలుగైదుసార్లు కాలింగ్‌బెల్ మోగి ఈసారి ఆగకుండా మోగడంతో విధిలేక లేచివెళ్ళి పిల్లిలా తలుపు తెరిచాడు.

పక్కింటి పాపకాదు.

ఎదురుగా కొడుకు, కోడలు.

"రండి రండి" ప్రక్కకి తప్పుకున్నాడు వాళ్ళని చూడగానే.

పక్కింటి కాంపౌండ్‌వాల్ మీదనుంచి తొంగి తొంగి చూస్తోంది ఆ పాప. దశరథరామయ్యని చూడగానే ముక్కు కోసేస్తానన్నట్లుగా కుడిచేతి చూపుడు వేలుని ముక్కుమీద అడ్డంగా ఆడించింది నవ్వుతూ. దశరథరామయ్య కూడా అదే సౌంజ్ఞ చేశాడు తలుపు మూయబోయేముందు.

ఎనభై ఆరోనంబర్ బస్ టెర్మినర్లో ఆగింది. అదే ఆఖరి స్టాప్ కాబట్టి అంతా దిగిపోయారు. చిల్లర లేకపోవడంవల్ల టిక్కెట్ వెనక రాసిన కండక్టర్ ఇద్దరు పేసెంజర్స్‌కి చిల్లర ఇచ్చి పంపేశాక యింకా బస్‌లో కూర్చున్న రాజేష్‌ని చూసి అడిగాడు.

"దిగలేదా?"

"బస్టాప్ రాగానే చెప్తానన్నారుగా?" అడిగాడు రాజేష్.

అప్పుడు గుర్తొచ్చింది కండక్టర్‌కి ఆ కుర్రాడు ఈ ఊరికి కొత్తని, లలితానగర్ కాలనీకి వెళ్ళాలనుకున్నాడని. తన మతిమరుపుకి ఎంతో నొచ్చుకున్నాడు.

"కూర్చో బస్ మళ్ళీ అక్కడికే వెళుతుంది" చెప్పాడు కండక్టర్.

పావుగంట తర్వాత మళ్ళీ ఎనభై ఆరో నంబరు బస్ వెనక్కి బయలుదేరింది. ఈసారి టిక్కెట్టు ఇచ్చేటప్పుడు కండక్టర్ రాజేష్ దిగాల్సిన బస్‌స్టాప్ రాగానే అతన్ని అక్కడ దిగమని చెప్పాల్సిన బాధ్యత తనమీద వుందన్న సంగతి గుర్తుపెట్టుకున్నాడు.

తిరుగు ప్రయాణంలో కండక్టర్ తన బాధ్యత విస్మరించలేదు. జామై ఉస్మానియా గేటుదగ్గర బస్ ఆగగానే రష్‌గా వున్నా, రాజేష్ దగ్గరికి వెళ్ళి చెప్పాడు.

"ఇక్కడే నువ్వు దిగాల్సింది."

రాజేష్ బస్ దిగాడు జామై ఉస్మానియా స్టేషన్‌లో నిలబడి వున్న రైలువంక ఆసక్తిగా చూశాడు. అది కదిలి కనుమరుగయ్యేదాకా అక్కడ నుంచి కదలలేదు. తరువాత అడుగులు వేశాడు.

ఈ ఇల్లు ఎక్కడో చెప్పగలరా?" అడిగాడు రాజేష్ జారిపోయే బొందు పైకి లాక్కుంటూ.

అతను ఆ కాగితంలోని చిరునామాని చదివాడు.

కె.దశరథరామయ్య

ప్లాట్ నెంబరు 115

లలితానగర్ కాలనీ

హైదరాబాద్.

"లలితానగర్ అంటే, అదిగో ఆ సందులోంచి లోపలికి వెళ్ళాలి" చెప్పాడు అతను కాగితం యిచ్చేసి. తన సామానుతో ఆ సందులోకి నడిచాడు రాజేష్. నాలుగడుగులు వేయగానే ఓ ఇంట్లోంచి బంతొకటి రివ్వున వచ్చి రోడ్డుమీద పడింది. రాజేష్ వంగి దాన్ని అందుకుని ఆ ఇంట్లోకి కాంపౌండ్ వాల్ మధ్యనించి విసిరేశాడు. లోపల చాలామంది చిన్నపిల్లలు ఆడుకుంటున్న సందడి వినిపిస్తోంది. ఆ ఇంట్లోకి వెళ్ళి వాళ్ళతో ఆడుకోవాలని మనసుపడినా, అతడు ముందుకు అడుగులేశాడు.

కొద్దిదూరం వెళ్ళాక ఆ కాగితాన్ని ఆ ఇంటిగేటు బయట నిలబడ్డ ముప్పై అయిదేళ్ళావిడకి చూపించి అడిగాడు -

"మా తాతయ్య ఇల్లెక్కడో చెప్పగలరా?"

ఆవిడ రాజేష్‌ని సూటిగా చూసి చిరునామాని చదివి చెప్పింది.

ఆ కుడివైపు అందులో బాదం చెట్టిల్లు."

"బాదం కాయలు కాస్తున్నాయండి?" అడిగాడు రాజేష్ ఆశగా ఆవిడ మాటలకి అడ్డొస్తూ.

"ఆయన నీకేమవుతారు? అడిగింది ఆవిడ.

"తాతయ్య."

"మీ నాన్నగారి పేరు?"

"సాంబశివరావుగారు."

ఆవిడ విచిత్రంగా చూస్తూ అడిగింది.

"ఏమిటి? దశరథరామయ్యగారు నీ తాతయ్యా? సాంబశివరావు నీ నాన్నా?"

"అవును."

రాజేష్ ఆవిడ చూపించిన వైపు గబగబా నడిచాడు.

"ఏమండీ? ఈ విచిత్రం విన్నారా?"

ఆవిడ అంతకంటే గబగబా అడుగులు వేసింది.

"ఆ ఇంటి బయట 'పంచాక్షరరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అన్న బోర్డు తగిలించి ఉంది.

సందు మొదట్లో రాజేష్ ముందునుంచి వెళ్ళి ఓ స్కూటర్. దాని వెనక సాంబశివరావు భుజాలని పట్టుకుని నీరజ క్షణకాలం రాజేష్‌ని, అతని భుజం మీద తిరిగే ఉడత పిల్లని చూసింది. ఇతన్ని ఎక్కడో చూశానే అనుకుంది. కానీ వెంటనే గుర్తొచ్చింది ఆ "క్యూట్ చైల్డ్"ని ఎక్కడ చూసిందో. ఆ సంగతి ఆమె మనసులోంచి వెంటనే అదృశ్యమైపోయింది.

బాదం చెట్టు ఇల్లు దగ్గరయ్యేకొద్దీ రాజేష్‌లో ఉత్సాహం, హుషారు అధికం అవుతున్నాయి. అతనిలో కొత్త ఊపిరి చోటుచేసుకుంటోంది.

చిన్నప్పట్నుంచి ఎన్నిసార్లు అడిగాడు తాతయ్య దగ్గరికి తీసుకెళ్ళమని.

ఎన్నిసార్లు తీసుకెళతానని అమ్మ అబద్దం ఆడింది.

ఎప్పుడైనా గొడవచేస్తే 'అలా అయితే తాతయ్య దగ్గరికి తీసుకెళ్ళను' అని బెదిరించేది. ఎప్పుడైనా ఇంగ్లీషు పాఠాలు చెప్పి ఫలానా ట్వింకల్లా చేస్తే తాతయ్య దగ్గరికి తీసుకెళతాను. ఆయన 'గుడ్' అంటారు అనేది. అమ్మకూడా వచ్చివుంటే ఎంత బావుండేది. అమ్మ గుర్తుకురాగానే ఎంతో దిగులనిపించింది రాజేష్‌కి.

ఆలోచనల్లో వున్న రాజేష్‌కి నెత్తిమీద పైనించి బక్కెట్ నీళ్ళు వచ్చిపడ్డాయి. ఉలిక్కిపడి తలెత్తి చూశాడు.

మేడమీద వున్న బాల్కనీలోంచి నవ్వుతూ చూస్తోంది ఎనిమిది తొమ్మిదేళ్ళ పిల్ల. ఆ పాప చేతిలో ఖాళీ బక్కెట్టు. తలెత్తి పైకి చూసిన రాజేష్‌ని నాలికతో వెక్కిరించింది

సరిగ్గా అదే సమయానికి ఆ పాప తల్లి బాల్కనీలోకి అడుగు పెట్టింది. జరిగింది గ్రహించి ఆ పాప కుడి చెవి పట్టుకుంది కోపంగా. కొట్టడానికి ఆవిడ ఎత్తిన చెయ్యి ఆగిపోయింది కిందనించి రాజేష్ మాటలు వినగానే.

"వద్దండి, కొట్టకండి."

ఆవిడ రాజేష్ వంక తేరిపార చూసింది. రాజేష్ తలనుంచి నీళ్ళు కారుతుంటే చెప్పాడు గబగబా.

"నాకు మూర్ఛరోగం ఉందండి. మూర్ఛవచ్చి పడితే నీళ్ళు చల్లింది. అందుకే మెలుకువ వచ్చింది. ఇందులో పాప తప్పేం లేదు."

ఆవిడకి క్షణకాలం "అబ్బా! ఎంత మంచి అబ్బాయి, అనిపించింది ఆ అబద్దం వినగానే. తన కూతురికి అంత తెలివితేటలు లేవని తెలుసు.

వెంటనే రాజేష్ అంటే జాలివేసింది. మూర్ఛరోగం వున్నందుకు. లోపలికి వెళ్ళిపోయింది ఆవిడ.

ఆ పాప వెంటనే రివ్వున కిందకి పరిగెత్తుకొచ్చి రాజేష్‌కి థాంక్స్ చెప్పింది దెబ్బలు తప్పినందుకు. నోటితోనే అయినా మాటలతోకాదు, అతన్ని ముద్దుపెట్టుకుని.

"మీదే సందు?" అడిగింది.

"ఇదే" చెప్పాడు.

"అయితే మనం ఫ్రెండ్స్."

తడిసిన ఉడతపిల్ల మిర్రిమిర్రి చూస్తోంది ఆ పిల్లవంక.

రాజేష్‌కి ఈ యిబ్బంది ఎదురైంది. బాదం చెట్టు ఓ యింటి కాంపౌండ్ మధ్యలోంచి మొలిచి ఉంది. రెండు యిళ్ళవైపు పాకాయి కొమ్మలు. ముందర కుడివైపు యింటి తలుపు తట్టాడు. పధ్నాలుగేళ్ళ కుర్రాడు తలుపు తీశాడు.

"మా తాతయ్య దశరథరామయ్యగారిల్లు యిదేనా?" అడిగాడు.

"కాదు పక్కిల్లు" చెప్పాడు ఆ కుర్రాడు.

"సారీ!"

రాజేష్ వెనక్కి తిరిగి టింకుతో చెప్పాడు ఆనందంగా.

"వచ్చేసాం. మన తాతయ్యగారింటికి వచ్చేసాం."

పక్కింటి గుమ్మం ఎక్కి తలుపు తట్టాడు. లోపలనించి వినపడింది.

"భడవా! బెల్లు నొక్కితే తెలుస్తుందని తలుపు కొట్టం నేర్చుకున్నావా?"

మళ్ళీ తలుపు తట్టాడు రాజేష్.

"నే తియ్యను పో" అదే కంఠం మళ్ళా వినిపించింది.

పొగాగుతో చుట్ట చుట్టుకోవడం పూర్తిచేశాక దశరథరామయ్య దాన్ని నోట్లో ఉంచుకుని అగ్గిపుల్ల గీసి అంటించుకున్నాడు. మళ్ళీ తలుపు చప్పుడు వినపడింది.

"తీయనంటే తీయనంతే" చెప్పాడు కోపంగా.

"నేను తాతయ్యా! తలుపు తియ్యి" వినిపించిందో కొత్తకంఠం.

"ఎవరది?" అడిగాడు దశరథరామయ్య.

"నేను తాతయ్యా. నీ మనవడిని."

అది చిన్నపిల్లవాడి కంఠంగా గుర్తించాడు. ఆయన లేచి వెళ్ళి తలుపు తెరిచాడు. బయటకి చూశాడు. ఆయన అనుమానపడ్డట్టుగా పక్కింటి పాప కంఠం మార్చలేదు.

ఎదురుగా ఓ ముచ్చటైన పిల్లవాడు నిలబడి ఉన్నాడు.

"దశరథరామయ్యగారున్నారా?" అడిగాడు.

"ఎవరు?" ఆశ్చర్యంగా ఆ పిల్లవాడివంక చూస్తూ అడిగాడు దశరథరామయ్య.

"మా తాతయ్య."

"మీ తా...ఎవరు?" కళ్ళు చిట్లించి ఆ కుర్రాడివంక చూస్తూ అడిగాడాయన.

"మా తాతయ్య దశరథరామయ్య వున్నాడా అంటే మాట్లాడవే?"

చూడగానే ఆ పిల్లవాడి బుగ్గలు నులిమి ముద్దుపెట్టుకోవాలనిపించేలా వున్నాయి. భుజాలనించి కిందకి దిగి, నడుం దగ్గర నల్లటి నిక్కరుని పట్టుకుని వున్నాయి రెండు పట్టీలు. ఆ నిక్కరులోకి టక్ చేసుకున్న తెల్లటి షర్ట్ దుమ్ము కొట్టుకుపోయి, చాలా దూరం నించి వస్తున్న సంగతి తెలియచేస్తోంది. కాళ్ళకి ఎర్రటి సాక్స్, ఎర్రటి బూట్లు, క్రాఫ్ రేగిపోయి జుట్టు నుదుటిమీద పడుతోంది. ఏడేళ్ళలోపు వయసు, ఆ పిల్లవాడి భుజాలమీద నించి తలమీద, తలమీదనించి భుజాలమీదకి నిర్భయంగా తిరుగుతోంది ఓ చిన్న ఉడతపిల్ల. తల, ఒళ్ళు, కాళ్ళతో తడిసి నీటిబొట్లు కారుతున్నాయి.

"నేనే" చెప్పాడు దశరథరామయ్య.

"నువ్వేనా? నిన్ను నువ్వు అనొచ్చా తాతయ్యా?" అడిగాడు.

మౌనంగా తలవూపాడాయన.

"నిన్ను చూడగానే అనుకున్నా నువ్వే తాతయ్యవని. అమ్మ చెప్పిందిలే. నీకు తెల్లగడ్డం, తెల్లమీసాలు ఉంటాయని."

దశరథరామయ్యకి నోరు పెగలలేదు. అలాగే చూస్తూ నిల్చుండిపోయాడు.

ఆయన చూపు తన భుజం మీద వున్న ఉడుత మీద పడటం గమనించి చెప్పాడు.

"ఇదా నా ఫ్రెండ్ పేరు 'టింకు' లోపలికి రానా తాతయ్యా?" అడిగాడు నవ్వుతూ.

అచేతనంగా నిలబడ్డ దశరథరామయ్య యాంత్రికంగా ప్రక్కకి తప్పుకున్నాడు. రాజేష్ పెట్టె అందుకుని లోపలికి వచ్చి చెప్పాడు.

"అమ్మయ్య ఎలాగోలా వచ్చేశాను తాతయ్య."

"ఒక్కడివే వచ్చావా?" అడిగాడాయన తేరుకుంటూ.

"అవును. అమ్మ త్వరలో వస్తానంది."

"అమ్మ?"

"అవును. మా అమ్మకి చాలా పనులున్నాయ్. అవి చూసుకుని వస్తానంది."

"మీ నాన్నగారి పేరు?" అడిగాడు దశరథరామయ్య.

"సాంబశివరావుగారు" చెప్పాడు రాజేష్ నేలమీద కూర్చుని బూటులేసులు విప్పుకుంటూ.

తన కుటుంబంలో బ్రహ్మాండం బద్దలవబోతోందని ఆ క్షణంలో దశరథరామయ్యకి చూచాయిగా అనిపించింది.

దశరథరామయ్య మరోసారి నిర్ధారణ చేసుకోడానికి అడిగాడు రాజేష్‌ని.

"నీ తాతయ్య పేరేమిటన్నావు? మళ్ళీ చెప్పు."

రాజేష్ బూట్లు విప్పుకుని లేచి నిలబడ్డాడు. మెరిసే కళ్ళతో దశరథరామయ్య వంక ఓసారి చూసి ఒక్క వుదుటున పరిగెత్తికెళ్ళి ఆయనని కౌగిలించుకున్నాడు. అప్రయత్నంగా దశరథరామయ్య రాజేష్‌ని పైకెత్తుకున్నాడు. రాజేష్ ఆయన మెడచుట్టూ తన చిన్న చేతులను వేసి చెప్పాడు.

"నా తాతయ్య పేరు నీ పేరే తాతయ్యా. దశరథరామయ్య."

"నీకెవరు చెప్పారు?"

"అమ్మ."

"మీ అమ్మ పేరు?"

"అమ్మ"

"అమ్మకి ఏదో పేరుంటుందిగా?"

"ఏమో? అమ్మ అంటాను నేను."

"నాన్న పేరు?

"నాన్నగారి పేరు సాంబశివరావు తాతయ్యా."

దశరథరామయ్యకి అయోమయంగా వున్నా, భయంగా ఎత్తుకున్న రాజేష్ తనని అలా కావలించుకోవడం ఎంతో హాయిగా ఉంది.

తను చిన్నపిల్లలని ఎత్తుకుని చాలాకాలం అయింది. ఎంతకాలమైంది? సాంబశివరావు వయసు ముప్పై. అంటే ఇరవైమూడి, ఇరవై నాలుగేళ్ళు దాటుతోంది. తనకున్న ఏకైక కొడుకుని ఇదే వయస్సులో ఎత్తుకునేవాడు. క్షణకాలం దశరథరామయ్య మనసు రెండు దశాబ్దాలు దాటి వెనక్కి వెళ్ళింది. ఆ కొడుకు కొడుకుని మళ్ళీ ఇప్పుడు తను ఎత్తుకున్నాడు.

తన రక్తం ప్రవహించే తనమనవడిని ఎత్తుకుంటున్నాడు. ఆయన మనసు ఆ భావానికి పులకించింది. రాజేష్‌ని ఇంకాస్త గట్టిగా హృదయానికి హత్తుకుని అతని లేత బుగ్గలమీద ముద్దుపెట్టుకున్నాడు. మళ్ళీ ఎంత కాలానికి పసివాడిని ముద్దుపెట్టుకోవటం అనిపించిందాయనకి.

"తాతయ్యా, నీకు రైలు నడపటం వచ్చని, చిన్నప్పుడు సర్కస్‌లో పనిచేశావని, చాలా సింహాలని, పులులని పెంచావని"

"ఇంకా ఏం చెప్పింది?"

"నీకు బోలెడన్ని కథలు వచ్చని, తెల్లగడ్డం, తెల్లమీస్మ వుంటాయని, గుర్రపుస్వారీ నేర్పిస్తావని, కుందేలుతో మాట్లాడటం నేర్పిస్తావని, నీకు చిలక భాష వచ్చని ఇంకా చాలా చెప్పింది."

"నీదేవూరు బాబూ?" అడిగాడు దశరథరామయ్య క్షణాల్లో తన అపూర్వ మానసిక స్థితి నించి తేరుకుని.

"విజయవాడ"

"నువ్వేం చదువుకున్నావ్?"

"సెకండ్ క్లాస్. ఫస్ట్ రేంక్ ఎప్పుడూ నాదే తాతయ్యా. నా రిపోర్ట్‌లో ఎప్పుడూ 'గుడ్.గుడ్.గుడ్' అని రాస్తుంది మా మేడమ్."

"మీ అమ్మ ఏం చేస్తుంది?

"స్కూల్లో టీచర్."

"ఏ స్కూలు?"

"నేను చదివే స్కూలే."

"పేరు?"

"లిటిల్ ఫ్లవర్."

"ఎక్కడుంది?

"ముత్యాలంపాడులో. రోజూ అమ్మా, నేనూ బస్‌లో వెళ్ళివస్తాం. ఎప్పుడయినా రిక్షాలో తీసుకెళుతుంది."

"మీ నాన్నగారిని ఎప్పుడైనా చూశావా?"

"ఊహూ! నాన్నగారు మా ఇంటికి ఎప్పుడూ రాలేదు తాతయ్యా. నాన్నగారేరి?"

"ఆఫీస్‌కి వెళ్ళారు."

"స్టేట్ బేంక్కా? సాయంత్రం వస్తారా?"

"ఆరున్నరకి వస్తాడు. నీకెట్లా తెలుసు స్టేట్ బేంక్ అని?"

"అమ్మ అన్నీ చెపుతుంది తాతయ్యా! చిన్నప్పుడు మా నాన్నగారిని ఎప్పుడైనా కొట్టేవాడివా?" అడిగాడు రాజేష్ ఆసక్తిగా చూస్తూ.

"ఓ అల్లరి చేసినప్పుడల్లా."

"మా అమ్మ చెప్పిందిలే. మరి నన్నూ కొడతావా?"

"అల్లరి చేస్తావా?"

"అయితే కొట్టను."

గలగలా నవ్వేశాడు రాజేష్.

"మరి నాన్నగారు?" అడిగాడు కాసేపాగి అనుమానంగా.

"మీ అమ్మ నిన్ను కొట్టేదా?"

"ఎప్పుడూ కొట్టదు. అమ్మ చాలామంచిది."

"అయితే నాన్నగారు కూడా కొట్టరు."

"తాతయ్యా! రోజూ నాకు నువ్వు కథ చెప్పాలి. ప్రతీ కథలో సింహం, ఏనుగు, లేదా పులి లేదా కుందేలు వుండాలి. నీకు వచ్చా?"

"వచ్చు"

దశరథరామయ్య ముక్కుపుటాలకి వాసన వేసింది. ఆ వాసన రాజేష్ తొడుక్కున్న లాగూలోంచి వస్తోందని గుర్తించాడు.

"ఛీ! లాగూలో పోసుకుంటారా? రాజేష్‌ని అకస్మాత్తుగా కిందకి దింపుతూ కోప్పడ్డాడు దశరథరామయ్య.

"లేదు తాతయ్యా నేను పోసుకోలేదు."

"లాగూ విప్పి, స్నానం చేసిరా ముందు"

రాజేష్ నిశ్శబ్దంగా పెట్టె తెరిచి వేరే లాగూ, చొక్కా చిన్న తువ్వాలు తీసుకున్నాడు. కళ్ళెత్తి బాత్‌రూం ఎటన్నట్లుగా చూశాడు ఆయనవంక.

ఇందాకటినించి దశరథరామయ్యకి తన మనసులో ఏర్పడ్డ భావం ఏమిటో అప్పుడు స్పష్టంగా అర్థమైంది.

జీవితంలో మొదటిసారి చూసినా, కొందరు ఎన్నో సంవత్సరాలుగా తెలిసివున్న వారు అనిపించే భావన కలిగిస్తారు. రాజేష్ వల్ల సరిగ్గా అలాంటి భావనే కలిగింది ఆయనకి. పుట్టినప్పటినుంచి ఆ ఇంట్లో తన కళ్ళముందే పెరిగినంత దగ్గరితనంగా ఫీలయ్యాడాయన.

కుడిచేతిని చాపి, రాజేష్ జుట్టులోకి తన అయిదువేళ్ళు చొప్పించి, ఆ వేళ్ళని అటూ ఇటూ కదిపి ఆప్యాయంగా అడిగాడు.

"నేను పోస్తా రా."

వెంటనే ఉలిక్కిపడ్డాడు. ఏమిటిది? ఎవరో "నువ్వు తాతయ్యా" అంటూ రాగానే నిజానిజాలు తెలుసుకోకుండా వాడ్ని నమ్మెయడమే?

"అటు" చూపించాడు.

"నాకు స్నానం చేయటం వచ్చు తాతయ్యా. అమ్మ యిక్కడికి పంపేముందు నేర్పింది."

రాజేష్ బాత్‌రూంలోకి వెళ్ళగానే దశరథరామయ్య పడకకుర్చీలో పడుకున్నాడు. చుట్ట వెలిగించి గుప్పుగుప్పున పొగ పీల్చి వదులుతూ ఆలోచించసాగాడు.

నిజంగా తన కొడుకు విజయవాడలో ఉద్యోగం చేస్తున్నప్పుడు రాజేష్ తల్లిని వివాహం చేసుకున్నాడా? ఆ సంగతి తననించి దాచి వుంచాడా? సాంబశివరావు పెళ్ళి గురించి తెలిసి ఆమె కొడుకుని ఇంటికి కావాలని పంపిందా?

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in